క్లుప్తంగా

వెంకన్న ఆలయానికి కిరీటాల బహూకరణ



ఆలయ కమిటీ సభ్యులకు కిరీటాలు అందిస్తున్న దాతలు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని శ్రీదేవి, భూదేవి, అమ్మవార్ల అలంకరణ కోసం గ్రామానికి చెందిన జలమూరు రామమోహన్‌రావు, వరలక్ష్మి దంపతులు, వారి అల్లుడు తిమ్మాపాత్రుని శ్రీనివాసరావు, ప్రమీలాదేవి(ఆస్ట్రేలియా) కిరీటాలు బహూకరించారు. ఈ మేరకు దాతలు వాటిని ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు రాపేట రామకోండలరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో టీ20 టోర్నీ ప్రారంభం



టాస్ వేసి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సిహెచ్.విజయ్

నర్సీపట్నం: ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల మైదానంలో నర్సీపట్నం ప్రీమియం లీగ్ సీజన్-1 టీ20 క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. ఈ పోటీలను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రారంభించారు. మొదటి బహుమతిగా రూ.66,666లు, రెండో బహుమతిగా రూ.33,333గా నిర్ణయించామని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా నూకాంబిక జాతర



దాలింపేట నూకాంబిక ఆలయం వద్ద భక్తుల రద్దీ

మాకవరపాలెం: మండలంలోని దాలింపేటలో నూకాంబిక జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా ఉగాది రోజున గ్రామంలో జాతరను నిర్వహించడం ఆనవాయితీ. గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాత్రికి గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులతో ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది.

ఘనంగా నూకాంబిక ఆలయ ప్రారంభోత్సవాలు



యాగశాలలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

కె.కోటపాడు : ఆనందపురం గ్రామంలో నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవ, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ పురోహితుడు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని, కలశం, త్రిశూలంను ఊరేగించారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, మండపారాధన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. సోమవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవం జరగనున్నట్టు గ్రామ సర్పంచ్ వంటాకు అప్పాజి తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

కోటి మంత్ర యజ్ఞం ప్రారంభం

అనకాపల్లి: ఉగాది సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ ఆవరణలో లక్ష్మీ గణపతి ఆలయంలో ఓం గం గణపతియే నమః కోటి మంత్ర యజ్ఞ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. లోక కల్యాణార్థం ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, విఘ్నాలు తొలగించే వినాయకుడి మూల మంత్రం జపం చేసుకోవాలని వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమార్‌స్వామి కోరారు. ఎన్ని మంత్రాలు జపించారో వాటి సంఖ్యను వాట్సాప్ గ్రూపులో పెట్టాలని కోరారు. మరిన్ని వివరాలకు 7386613333 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వేగి జగన్, పీ సోమశేఖర్ పట్నాయక్, బొట్టాచిన్ని యాదవ్, ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

సకల శుభాల 'విశ్వావసు' ఉగాది



ఉగాది పూజలందుకున్న చోడవరంలోని స్వయంభూ విఘ్నేశ్వరస్వామి



మాజీ ఎమ్మెల్యే గణేష్, కళావతి దంపతులను గజమాలతో సత్కరిస్తున్న పార్టీ నాయకులు



ఎ.భీమవరంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న అర్చకుడు



కె.జె.పురం రామాలయం వద్ద స్వామి వారి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

- వాడవాడలా తెలుగు నూతన సంవత్సర వేడుకలు
- భక్తులతో ఆలయాలు కళకళ
- గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో పంచాంగ శ్రవణం



ఉగాది వేడుకలను ఉద్దేశించి మాట్లాడుతున్న స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు



పంచాంగ శ్రావణం వేడుకల్లో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సన్యాసిపాత్రుడు, నాయకులు



నాతవరం మండలం పెదగొలుగొండపేట రామాలయంలో వేద పండితుల పంచాంగ శ్రావణం



కె.కోటపాడులో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నర్సీపట్నం: విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండగను ఆదివారం కుటుంబ సమేతంగా ఘనంగా జరుపుకొన్నారు. ఆలయాలను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వారి గోత్ర నామాలతో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉగాది పచ్చడిని ప్రసాదంగా అందించారు. తెలుగు వారి కొత్త ఏడాదిలో అందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షిస్తూ ఆలయాల్లో విశేష పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కుటుంబ సభ్యులతో కలిసి ఉగాది వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా గణేష్, కళావతి దంపతులను మున్సిపల్ వైస్‌చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ నాయకులు వరలక్ష్మి, లోకవరపు శారదా, అన్నపూర్ణ, కిల్లాడ శ్రీనివాసరావు, అల్లంపల్లి ఈశ్వరరావు తదితరులు గజమాలతో సత్కరించి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు అభిమానులు, పార్టీ నాయకులతో కలిసి వెలమవీధి రామాలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ వేడుకల్లో చింతకాయల వరుణ్, లాలం అప్పారావు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ నాయకులు చెరుకూరి సత్యనారాయణ, మామిడి శ్రీను, మళ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నివాసంలో కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులతో కలిసి ఉగాది పంచాంగ శ్రవణం నిర్వహించారు. నూకాంబిక ఆలయాన్ని రూ.50 లక్షలతో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానని స్పీకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.విజయ్, కౌన్సిలర్లు సిహెచ్.పద్మావతి, సిహెచ్.రాజేష్ పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: ఉగాది సందర్భంగా కె.జె.పురం రామాలయంలో ఉదయం నుంచి భక్తులు సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అర్చకులు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాపేట రామకోండలరావు ఆధ్వర్యంలో ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు. వంటర్లపాలెం, ముకుందపురం, వీరవల్లి, పోతనపూడి, జి.అగ్రహారం, వీరనారాయణం, చింతలూరు, గాదిరాయి, ఎం.కోటపాడు, సాగరం, కింతలి, కె.వల్లాపురం, తదితర గ్రామాల్లో సాయంత్రం పంచాంగ శ్రావణ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది రాశి ఫలాలను పురోహితులు ప్రజలకు విశదీకరించారు.

మాకవరపాలెం: గ్రామాల్లో ప్రజలంతా తెలుగు సంవత్సరాదిని వైభవంగా జరుపుకొన్నారు. రామాలయాల్లో నిర్వహించిన పంచాంగ శ్రవణం కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని రాశిఫలాలు, లాభ, నష్టాలను తెలుసుకున్నారు.

కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అర్చకుడు గోరుగుంతు రమేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గొండుపాలెం, ఎ.భీమవరం, రొంగలినాయుడుపాలెం, గుల్లేపల్లి, పాచిలవానిపాలెం, పైడంపేట తదితర గ్రామాల్లోని ఆలయాల వద్ద అర్చకులు పంచాంగ శ్రవణ కార్యక్రమాలను నిర్వహించారు.

చోడవరం: ఉగాది పండగ సందర్భంగా చోడవరంలోని స్వయంభూ విఘ్నేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ముందస్తుగా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతి, మహేష్ ప్రత్యేక పూజలు చేశారు. విఘ్నేశ్వరస్వామిని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామివారి సూక్తుల పోస్టర్లను ఆవిష్కరించారు. చోడవరం స్వయంభూ గౌరీశ్వరస్వామివారి ఆలయం, శ్రీ కేశవస్వామి ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు చేశారు. నూకాంబిక అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. ఆయా ఆలయాల వద్ద ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం ఉగాది పంచాంగ శ్రవణాన్ని జ్యోతిష్యుడు గౌరీశంకర శాస్త్రి వినిపించారు. స్థానిక ప్రేమ సమాజంలో ప్రసన్న భారతి ఆధ్వర్యంలో వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. బ్రాహ్మణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వేలమూరి రామారావు పంచాంగ శ్రవణం చేశారు. ట్రస్ట్ ప్రతినిధులు కందర్ప రమేష్, మంథా గౌరీశంకర్, పుల్లేవు శ్యామ్ ప్రసాద్, ఉపాధ్యాయుల శ్రీనివాస్, గుంటూరు సత్యనారాయణ పాల్గొన్నారు.



అర్జునగిరిలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు

నాతవరం: ఉగాది శోభతో గ్రామాలు కళకళలాడాయి. మండలంలోని 31 పంచాయతీల్లోని రామాలయాలను మామిడి తోరణాలతో ముస్తాబు చేశారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేద పండితులు పంచాంగ శ్రావణం చేశారు. ఉగాది పచ్చడిని భక్తులకు అర్చకులు అందజేశారు.

మాడుగుల: ఉగాది సందర్భంగా స్థానిక మోదకొండమ్మ ఆలయంతో పాటు ఓం.కోడూరు, సత్యవరం, జంపెన, గాదిరాయి, వొమమ్మి, జేడీపేట, కింతలి వల్లాపురం గ్రామాల్లోని నూకాలమ్మ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సత్యవరం ఆంజనేయస్వామి ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కింతలిలో నూకాలమ్మ తల్లికి పసుపు కుంకుమలతో పూజలు చేశారు. మాడుగులలో సాయంత్రం పంచాంగ శ్రవణం నిర్వహించారు.

రోలుగుంట: మండలంలో ఉగాది వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. రోలుగుంట పాత రామమందిరం వద్ద మధ్యాహ్నం పంచాంగం శ్రవణ కార్యక్రమాన్ని రేజేటి సీతారామచార్యులు నిర్వహించారు. రైతులకు, వ్యాపారులకు ఈ ఏడాది కాలనుగుణంగా వారి పేరు బలాలు, రాజపూజ్యం, అవమానం, ఆదాయం, ఖర్చులు, పంటలు, వర్షాలు, తుపాను, పిడుగుల ప్రభావాల గురించి కొత్తకోట నారాయణమూర్తి పంతులు చదివి వినిపించారు.

చీడికాడ: మండలంలోని 23 పంచాయతీల్లోనూ పంచాంగ శ్రవణాలు ఘనంగా జరిగాయి. రైతులు, పెద్దలు, యువకులు పాల్గొని జాతక ఫలాలు, పంటలు, చీడపీడలను తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

కందిపూడి పాఠశాలలో ఆకట్టుకున్న సంబరాలు



కందిపూడి పాఠశాలలో విద్యార్థుల పంచాంగ శ్రవణం



కందిపూడి పాఠశాలలో విద్యార్థుల ఉగాది సంబరాలు

బుచ్చెయ్యపేట: మండలంలోని కందిపూడి ప్రభుత్వ పాఠశాలలో ఉగాది సంబరాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు సంప్రదాయ వేషధారణలో పాల్గొని పంచాంగ శ్రవణం నిర్వహించారు. రైతులు, వేద పండితులు, మహిళలు, వేంకటేశ్వరస్వామి దేవతా మూర్తుల వేషధారణలో విద్యార్థులు అలరించారు. విద్యార్థుల వేషధారణ చూసి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మంత్రముగ్ధులయ్యారు.

అర్చకులకు ఉగాది పురస్కారాలు



అనకాపల్లి నూకాంబిక ఆలయంలో ఉగాది పురస్కారం అందుకుంటున్న వీరవల్లి అగ్రహారం అర్చకుడు సాధువులు



పురస్కారం అందుకుంటున్న దిబ్బిడి శివాలయం పంతులు సన్యాసిరావు

మాడుగుల రూరల్: జిల్లా స్థాయిలో అనకాపల్లిలో నిర్వహించిన ఉగాది సంబరాల్లో భాగంగా ఆదివారం పురస్కారాలు ప్రదానం చేశారు. వీరవల్లి అగ్రహారం ఉమా భీమలింగేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు రాంపల్లి విశ్వంభరశర్మ(సాధువులు)కు హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరు విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: దిబ్బిడి శివాలయం పంతులు దొంతుకుర్తి సన్యాసిరావు ఉగాది పురస్కారం అందుకున్నారు. అనకాపల్లిలో ఏర్పాటు చేసిన ఉగాది సంబరాల్లో ఆయనకు హోం మంత్రి అనిత, జాయింట్ కలెక్టర్ జాహ్నవి పురస్కారం అందజేశారు.

అప్పన్న చందనం సమర్పణకు రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం నగరంలోని ఇసుకతోట ప్రాంతానికి చెందిన లక్ష్మీనారాయణరావు దంపతులు ఆదివారం రూ.లక్ష విరాళం అందించారు. సింహగిరి పైనున్న పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్‌కు సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రంలను అధికారులు అందించారు.



సూపరింటెండెంట్ విక్రమ్‌కు విరాళం అందిస్తున్న దాత లక్ష్మీనారాయణరావు

వరి కుప్ప, ట్రాక్టర్ దగ్ధం

బుచ్చెయ్యపేట : మండలంలోని బుదిరెడ్లపాలెంలో ఆదివారం వరి కుప్ప, ట్రాక్టర్ దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రైతు నల్లబోయిన ఈశ్వరరావు తన పొలంలో ఉన్న వరి కుప్పను యంత్రం సహాయంతో నూర్చుతున్నాడు. ఎండకు నూర్పిడి యంత్రం వేడెక్కి అగ్గి నిప్పులు ఎగడిపడ్డాయి. దీంతో వరి కుప్పతో పాటు ధనం శెట్టి నాగేశ్వరరావుకు చెందిన ట్రాక్టర్ కూడా బూడిదయ్యాయి. మంటలను అదుపు చేయడానికి రైతులు ప్రయత్నించినా ఎండ తీవ్రత, గాలి కారణంగా ఫలితం లేకుండాపోయింది. సుమారు రూ.3 లక్షలు ఆస్తి నష్టం జరిగిందని బాధిత రైతులు వాపోయారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.



బుదిరెడ్లపాలెంలో దగ్ధమవుతున్న ట్రాక్టర్, వరి కుప్ప

హిందూ ధర్మం పరిరక్షణ కోసం ర్యాలీ

రావికమతం: హిందూ ధర్మం పరిరక్షణ కోసం ఆర్ఎస్ఎస్ సభ్యులు నడుం బిగించాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ జిల్లా ప్రచారకుడు హరి పిలుపునిచ్చారు. ఆదివారం మేడివాడలో స్వయం సేవక్ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించి పోతున్న ప్రాచీన సంప్రదాయాలను నిలబెట్టేలా యువకులు నడుం బిగించాలన్నారు. నేటి తరానికి రామాయణం, భగవద్గీత, వంటి పురాణాలు, దేశం కోసం ప్రాణాలర్పించిన నాయకులు విజయ గాధలు చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సభ్యులు గ్రేడ్డి నాయుడు, సర్పంచ్ శివ, వి.గోవింద, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న స్వయం సేవకులు

మసీదుల అలంకరణ



నూరి మసీదు విద్యుద్దీపాలతో అలంకరణ

కశింకోట: మండలంలోని ముస్లింలు సోమవారం రంజాన్ పండుగను నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఈ సందర్భంగా కశింకోటలో జామియా మసీదు, నూరి మసీదులను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. ఉదయం 8.30 గంటలకు గ్రామ శివారులోని నూకాంబిక ఆలయ సమీపంలో ఈద్-ఘా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు నూరి మసీదు కమిటీ కార్యదర్శి ఎస్ఎంఎం అలీ తెలిపారు. చింతలపాలెం మసీదులో రంజాన్ పార్ధనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో ఎంఏయూడీ ప్రధాన కార్యదర్శి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న సురేష్‌కుమార్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(ఎంఏయూడీ) ఎస్.సురేష్‌కుమార్ ఆదివారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో స్వామికి అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనమిచ్చి, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, చిత్రపటం శేషవస్త్రాన్ని దేవస్థానం ఈవో అందించారు.

మునగపాక పీఎస్‌ను సందర్శించిన డీఎస్పీ

మునగపాక: స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆదివారం పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూపం సందర్శించారు. సాధారణ విజిట్‌లో భాగంగా ఆయన స్టేషన్‌లోని పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొత్త అమావాస్య పండుగలో భాగంగా ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడా ల ని ఎస్ఐ ప్రసాదరావును ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఇవ్వకుండా శాంతియుత వాతావరణంలో పండుగలు జరిగేలా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలని సూచించారు.

2 నుంచి ఉచిత పాలిసెట్ శిక్షణ

అనకాపల్లి: పాలిసెట్ ప్రవేశ పరీక్ష కోసం ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక నర్సింగరావుపేట రామచంద్ర థియేటర్ వెనుక లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో వచ్చే నెల 2వ తేదీ నుంచి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ కాపారపు సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా విద్యార్థుల పేర్లు ట్రస్ట్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440389409 సంప్రదించాలన్నారు.

వేడుకగా సీతారాముల కల్యాణ రాట మహోత్సవం



రామాలయం వద్ద రాట మహోత్సవంలో భక్తులు

మునగపాక: స్థానిక పంచాయతీ వీధిలోని రామాలయం వద్ద ఆదివారం సీతారాముల వారి కల్యాణ రాట మహోత్సవం వేడుకగా నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా వేప చెట్టుకు పసుపుకుంకుమ అద్ది వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ రాట మహోత్సవాన్ని భక్తుల సమక్షంలో నిర్వహించారు. జై శ్రీరామ్ అంటూ భక్తులు నినదించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, ఆడారి లక్ష్మణరావు, మళ్ల జోగారావు, ఆడారి కాశీబాబు, అలంక ప్రకాశరావు, టెక్కలి రమణబాబు, జల్లేపల్లి కిష్టప్ప, వెలగా రామకృష్ణ, ఆడారి సూరిబాబు, పొలిమేర కృష్ణ, సూరిశెట్టి శ్రీనివాస్, కుంది సూర్యనారాయణ, బొడ్డేడ రామారావు, బూడిద శ్రీనివాసరావు, పూసర్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సర్వేశ్వరరావు

మాకవరపాలెం: మండల స్థాయి క్రికెట్ పోటీలను ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. మండలంలోని ఎస్‌జీఆర్‌పీ అగ్రహారంలో ఆదివారం మండల ప్రీమియర్ లీగ్(ఎంపీఎల్) పేరుతో క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇలాంటి పోటీలతో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీయొచ్చన్నారు. ఈ పోటీల్లో ఎనిమిది టీంలు పాల్గొన్నాయని, ప్రథమ బహుమతిగా రూ.80 వేలు, ద్వితీయ రూ.50 వేలు నగదును అందజేస్తామని నిర్వాహకుడు శ్రీకాంత్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో తూర్పు కాపు సంఘ మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు, వైఎస్సార్‌సీపీ మాజీ మండల అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, నిర్వాహకులు సుకల శ్రీను, నాని, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికి సముచిత స్థానం



రత్నకుమారిని శాలువాతో సత్కరిస్తున్న జానకీ రామరాజు, మలసాల కుమార్‌రాజా

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ కోసం కష్టపడి పనిచేసిన వ్యక్తులకు పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం ఇస్తున్నారని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ పార్టీ సీనియర్ నాయకుడు మలసాల కుమార్‌రాజా తెలిపారు. మండలంలో గుండాల జంక్షన్ వద్ద నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన అంట్యాకుల రత్నకుమారిని శనివారం వారు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.